www.prajasakti.com
ప్రజాశక్తి
గురువారం 20 మార్చి 2025

దుకాణాలకు స్మార్ట్ మీటర్లు

దుకాణానికి స్మార్ట్ మీటర్ బిగిస్తున్న సిబ్బంది

నూజివీడు టౌన్ : నూజివీడు పట్టణ పరిధిలో దుకాణాలకు పాత మీటర్లు తొలగించి డిజిటల్ మీటర్లను ఎపిఎస్‌పిడిసిఎల్ సిబ్బంది బుధవారం బిగిస్తున్నారు. ఇప్పటికే ఆరు టీములు పట్టణం మొత్తం పర్యటిస్తూ చిన్న తరహా, పెద్ద వ్యాపారాలకు సైతం డిజిటల్ మీటర్లు ఏర్పాటు చేస్తున్నారు. ఇప్పటికే ప్రభుత్వ కార్యాలయాలకు డిజిటల్ మీటర్లు ఏర్పాటు చేయగా, పట్టణ పరిసర ప్రాంతాలలో ఉన్న అన్ని దుకాణాలకు డిజిటల్ మీటర్లను బిగిస్తున్నారు. వ్యాపారాలు సక్రమంగా కొనసాగని ప్రస్తుత తరుణంలో డిజిటల్ మీటర్ల పేరుతో మరింత విద్యుత్ బిల్లుల భారం మోపడం తగదని చిరు వ్యాపారాలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పాలకులు, ప్రజాప్రతినిధులు దీనిపై దృష్టిసారించి డిజిటల్ మీటర్ల స్థానంలో పాత మీటర్లు కొనసాగింపు ఉండాలన్నారు.

అదనపు సాయం.. అసంపూర్ణం..!

అసంపూర్తిగా నిలిచిన పేదల ఇళ్ల నిర్మాణం పూర్తికి కూటమి ప్రభుత్వం అదనపు సాయం ప్రకటించింది. అయితే ఇది అరకొర సాయం అంటూ లబ్ధిదారులు పెదవి విరుస్తున్నారు. రూ.50 వేలు ఆర్థిక సాయం ఏమూలకూ సరిపోదని, కనీసంగా రూ.రెండు లక్షలైనా ఇస్తేనే ఇళ్ల నిర్మాణం పూర్తయ్యే అవకాశం ఉందని ఘంటాపథంగా చెబుతున్నారు.

ఇళ్ల నిర్మాణానికి అదనపు సాయంపై లబ్ధిదారుల పెదవివిరుపు
అధికారుల ఒత్తిడితో కొన్నిచోట్ల ఇళ్ల నిర్మాణ పనులు పునఃప్రారంభం
ప్రభుత్వమే ఇళ్లు నిర్మించి ఇవ్వాలని డిమాండ్
లేనిపక్షంలో ఇంటికి రూ.2 లక్షలు ఇవ్వాలని విజ్ఞప్తి

ప్రజాశక్తి - పశ్చిమ డెస్క్

ఇంటి నిర్మాణానికి గత ప్రభుత్వం ఏ రూపంలోనైనా రూ.1.80 లక్షలు మంజూరు చేసేది. వాస్తవంగా ఒక సాధారణ ఇంటి నిర్మాణానికి ఏడు నుంచి పది లక్షల రూపాయల వరకూ ఖర్చవుతోంది. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం అసంపూర్తిగా మధ్యలో నిలిచిపోయిన ఇళ్లకు రూ.50 వేల నుంచి రూ.లక్ష వరకూ అదనపు సాయం ప్రకటించింది. దీనిలో బిసిలు, ఎస్‌సిలకైతే రూ.50 వేలు, ఎస్‌టిలకైతే రూ.75 వేలు, ఆదివాసీ గిరిజనులకు రూ.లక్ష చొప్పున అదనపు సాయం ప్రకటించింది. పశ్చిమగోదావరి జిల్లాలో సుమారు 18,340 మంది బిసి, ఎస్‌సి, ఎస్‌టిలకు చెందిన ఇళ్ల నిర్మాణం వివిధ దశల్లో నిలిచిపోయినట్లు గుర్తించారు. ఏలూరు జిల్లాలో ఈ సంఖ్య సుమారు 49,436గా గుర్తించారు. అంటే ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో మొత్తం 67,776 గృహాల లబ్ధిదారులకు అదనపు సాయం అందే అవకాశం ఉంది. అయితే అదనపు సాయం అందే లబ్ధిదారుల్లో పశ్చిమగోదావరి జిల్లాలో బిసిలు 12,362, ఎస్‌సిలు 5,593, ఎస్‌టిలు 385 మంది ఉండగా, ఏలూరు జిల్లాలో బిసిలు 27,150, ఎస్‌సిలు 18,452, ఎస్‌టిలు 3,293, ఆదివాసీ గిరిజనులు 541 మందిగా గుర్తించారు. అయితే వీరు తమ ఇళ్ల నిర్మాణం వచ్చే ఏప్రిల్ నెలాఖరులోగా పూర్తి చేసుకుంటేనే అదనపు సాయం లభిస్తుందనే నిబంధన విధించారు. ఆ సొమ్ము కూడా ఒక్కసారిగా కాకుండా ఇంటి నిర్మాణ దశలను బట్టి విడతలవారీ లబ్ధిదారుల ఖాతాకు జమ చేస్తామని ప్రభుత్వం ప్రకటించింది. మొత్తం ప్రభుత్వం తీరు చూస్తే మరోసారి ఇళ్ల నిర్మాణానికి ఉసికొల్పి అప్పుల ఊబిలోకి దింపేలా ఉందని లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పునాది దశ నుంచి శ్లాబ్ వరకూ వివిధ స్థాయిలో ఆయా ఇళ్ల నిర్మాణం నిలిచిపోయి ఉంది. పునాది దశ నుంచి శ్లాబ్ దశలోపు నిలిచిన ఇళ్లకు ప్రభుత్వం ఇస్తున్న రూ.50 వేలు ఎలా సరిపోతాయని లబ్ధిదారులు ప్రశ్నిస్తున్నారు. ఏమూలకూ సరిపోవని, ఇసుక, ఇటుకలు, సిమెంట్, మెటల్, భవన నిర్మాణ కూలీలకు సొమ్ము ఎక్కడ నుంచి తీసుకురావాలని నిర్వేదం వ్యక్తం చేస్తున్నారు. మొత్తం సొమ్ము బల్క్‌గా ఇచ్చినా ఎంతోకొంత అప్పు చేసైనా ఇంటి పనులు కొలిక్కి తెచ్చుకునే అవకాశాలుంటాయని చెబుతున్నారు. ప్రభుత్వం ఇచ్చే స్థలాల్లో ఇళ్లు నిర్మించుకునేవారికి రూ.5 లక్షలు ఇవ్వాలని, లేదా ప్రభుత్వమే ఇళ్లు నిర్మించి ఇవ్వాలని సిపిఎం చాలాకాలంగా డిమాండ్ చేస్తోంది. గత వైసిపి ప్రభుత్వం ఈ డిమాండ్‌ను పెడచెవిన పెట్టింది. దీంతో జగనన్న కాలనీల్లో ఇళ్లు తప్పులతో నిండిపోయాయి. కొన్నిచోట్ల ఇళ్లు నిర్మించుకున్నా కనీస సౌకర్యాలు లేకపోవడంతో నివాసం ఉండేందుకు నానావస్థలు పడుతున్నారు. తాజాగా రెండు జిల్లాల్లో సిపిఎం నిర్వహిస్తున్న ప్రజాచైతన్య యాత్రల్లో కాలనీల్లో వసతుల లేమి సమస్య పెద్దఎత్తున తెరపైకి వచ్చిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలోనైనా ప్రభుత్వం పున పరిశీలించి నిలిచిపోయిన ఇళ్ల నిర్మాణానికి కనీసంగా రూ.2 లక్షల వరకూ సాయం అందించాలని, లేనిపక్షంలో ప్రభుత్వమే ఆ ఇళ్ల నిర్మాణం పూర్తి చేయాలని లబ్ధిదారులు కోరుతున్నారు. అలాగైతేనే ప్రభుత్వం ప్రకటించిన అదనపు సాయం ఫలితమిచ్చి ఇళ్ల నిర్మాణం పూర్తయ్యే అవకాశం ఉందని, లేనిపక్షంలో శ్లాబ్ దశ దాటిన ఇళ్లు మాత్రమే పూర్తయ్యే అవకాశం ఉందని స్పష్టం చేస్తున్నారు. దీనిపై ప్రభుత్వం పునరాలోచిస్తుందో... లేదో వేచిచూడాలి.

బ్యాంకర్లు లక్ష్యాలను పూర్తి చేయాలి

కౌలురైతులకు అండగా నిలవాలి
ముద్ర రుణాలపై విస్తృత అవగాహన కల్పించాలి
బ్యాంకర్ల సమావేశంలో కలెక్టర్ కె.వెట్రిసెల్వి

ప్రజాశక్తి - ఏలూరు

జిల్లాలో వ్యవసాయరంగానికి ఇతోధికంగా రుణ సౌకర్యం కల్పించాలని జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి అన్నారు. స్థానిక కలెక్టరేట్‌లోని గౌతమి సమావేశపు హాలులో మంగళవారం త్రైమాసిక బ్యాంకర్ల సమావేశం కలెక్టర్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులకు, ప్రభుత్వ పథకాల లబ్ధిదారులకు వివిధ రుణాలందించి వారి పురోభివృద్ధికి తోడ్పడాలన్నారు. పంట సాగు చేస్తున్న సిసిఆర్‌సి కార్డులు కలిగిన కౌలు రైతులకు తప్పనిసరిగా రుణాలు అందించాలని సూచించారు. జిల్లాలో 23,314 మంది సిసిఆర్‌సి కార్డులు కలిగిన కౌలు రైతులకు ఇంతవరకు రూ.142.85 కోట్లు అందించారని, ఇదే సమయంలో సిసిఆర్‌సి కార్డులు కలిగిన ప్రతి కౌలు రైతుకూ రుణ వరపతి కల్పించాలని స్పష్టం చేశారు. కౌలు రైతులకు, మత్స్యకారులకు, పశు పోషణ నిమిత్తం చిన్న, సన్నకారు రైతులకు రుణాలిచ్చి ఆర్థికంగా చేయూతనివ్వాలని బ్యాంకర్లను కలెక్టర్ ఆదేశించారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి సంబంధించి డిసెంబర్ వరకు రూ.6,639 కోట్లు స్వల్పకాలిక వ్యవసాయ రుణాలు అందించారన్నారు. ప్రాధాన్యతారంగాలకు సంబంధించి రూ.15,778 కోట్లకుగాను ఇంతవరకు రూ.13,277 కోట్లు (84.15) శాతం రుణాలు అందించారని, మార్చి చివరినాటికి నూరుశాతం లక్ష్యాలను సాధించాలన్నారు. ప్రభుత్వ పథకాలకు వివిధ బ్యాంకుల ద్వారా ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ.90.63 కోట్లు విద్యారుణాలుగా, రూ.618.63 కోట్లు హౌసింగ్ రుణాలుగా అందించారని, వీటిని మరింత విస్తృతం చేయాలని బ్యాంకర్లకు కలెక్టర్ సూచించారు. ప్రధాని సూర్యఘర్ ముఫ్త్ బిజిలీ యోజన కింద అత్యధిక ప్రాధాన్యతనిచ్చి పూర్తిస్థాయిలో అమలుకు కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలన్నారు. జిల్లాలో ఇంతవరకు 1447 దరఖాస్తులకుగాను ఇంతవరకు 715 మందికి రూఫ్‌టాప్ సోలార్ యూనిట్లు మంజూరు చేశారని, మరో 305 పరిశీలనలో ఉన్నాయని అన్నారు. వివిధ కారణాలతో తిరస్కరించిన 415 దరఖాస్తులను పునఃపరిశీలించి అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. లబ్ధిదారుడు సొంతస్థలం చూపిస్తే కూడా మంజూరు చేయవచ్చనే నిబంధనను పరిశీలించాలని కలెక్టర్ సూచించారు. పిఎం స్వనిధి, పిఎం విశ్వకర్మ, పిఎం ఇజిపి, వంటి పథకాల్లో పెండింగ్‌లో ఉన్న, తిరస్కరించిన దరఖాస్తులను పునఃపరిశీలన చేసి రుణాలు మంజూరుకు సంబంధిత లబ్ధిదారులకు ఫోన్ కాల్ ద్వారా సమాచారం ఇవ్వాలని సూచించారు. ప్రతి బ్యాంకులో దీనికి సంబంధించిన సమాచారం తెలిపే పోస్టర్లను ప్రదర్శించాలన్నారు. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు సంబంధించి ఆయా బ్యాంకులకు నిర్దేశించిన లక్ష్యాలను కొన్ని బ్యాంకులు జీరో పెర్ఫార్మెన్స్ కనబరుస్తున్నాయని, మార్చిలోపు అటువంటి బ్యాంకులు లక్ష్యాలు పూర్తి చేయకపోతే ఎస్‌ఎల్‌బిసి దృష్టికి తీసుకెళ్లడంతోపాటు ఆయా బ్యాంకుల్లో ప్రభుత్వ డిపాజిట్లను వెనక్కి తీసుకుని నిలుపుదల చేస్తామని హెచ్చరించారు. మండలస్థాయిలో జెఎంఎల్‌బిసి సమావేశాలు తప్పనిసరిగా నిర్వహించాలన్నారు. ఆర్‌బిఐ ఎల్‌డిఓ వి.పూర్ణిమ మాట్లాడుతూ ఆర్‌బిఐ ప్రమాణాలకు అనుగుణంగా 2024-25 సంవత్సరానికి సంబంధించి మొత్తం రుణాల్లో వ్యవసాయానికి 18 శాతం, ప్రాధాన్యత రంగాలకు 40 శాతం రుణాలు ఇవ్వాల్సి ఉండగా జిల్లాలో ఈ లక్ష్యాలను మించి వ్యవసాయానికి 57.41 శాతం, ప్రాధాన్యత రంగాలకు 72.07 శాతం రుణాలు ఇచ్చారన్నారు. సమావేశంలో యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రీజనల్ హెడ్ ఎన్.శ్రీనివాస్, ఎల్‌డిఎం డి.నీలాద్రి, నాబార్డ్ డిడిఎం అనిల్‌కాంత్, జిల్లా వ్యవసాయ శాఖాధికారి హబీబ్ భాషా, ఉద్యాన శాఖ డిడి ఎస్.రామ్మోహన్, ఎపిఐఐడిసిఎల్ ఎస్ఇ పి.సాల్మన్‌రాజు, జిల్లా పరిశ్రమల కేంద్రం జిఎం సుబ్రహ్మణ్యేశ్వరరావు, జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి ఎస్‌ఎస్ కృపావరం, మత్స్యశాఖ జెడి నాగలింగాచార్యులు, బిసి కార్పొరేషన్ ఇడి ఎన్.పుష్పలత, సోషల్ వెల్ఫేర్ జెడి జయప్రకాష్, బ్యాంకుల కంట్రోలర్లు, కోఆర్డినేటర్లు పాల్గొన్నారు.

పోగొండ ఆయకట్టుకు పూర్తిస్థాయిలో సాగునీరివ్వాలి

ప్రజాచైతన్య యాత్రలో సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యురాలు మొడియం నాగమణి

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

పోగొండ రిజర్వాయర్ ఆయకట్టు కింద రైతులందరికీ సాగునీటిని అందించాలని సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యురాలు మొడియం నాగమణి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం మండలంలోని కోయరాజమండ్రి, సీతప్పగూడెం, దొరమామిడి, అలివేరు, కొరసవారిగూడెం పంచాయతీల మీదుగా ప్రజాచైతన్య యాత్ర మూడో రోజు కొనసాగింది. యాత్రలో భాగంగా పోగొండ రిజర్వాయర్ పంట కాలువను యాత్ర బృందం పరిశీలించింది. ఈ సందర్భంగా మొడియం నాగమణి మాట్లాడుతూ 2018లో ఈ ప్రాజెక్టును అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు జాతికి అంకితం చేశారన్నారు. రూ.129 కోట్లతో నిర్మాణం చేపట్టిన ఈ ప్రాజెక్టు ద్వారా రైతులకు నీరందించడంలో విఫలమైందన్నారు. కుడి, ఎడమ కాలువలకు దిగున ఉన్న సుమారు రెండు వేల ఎకరాల భూములకు సాగునీరు అందించే ఉద్దేశంతో నిర్మించిన ఈ ప్రాజెక్టు పంట కాలువలు, కల్వర్టుల నిర్మాణం పూర్తి కాకపోవడం వల్ల రైతులకు పూర్తిస్థాయిలో నీటిని అందించలేకపోతున్నారన్నారు. ఈ సంవత్సరమైనా పనులను పూర్తి చేసి రైతులకు పూర్తిస్థాయిలో సాగునీటిని అందజేయాలని, ఇప్పటికే నీటిఎద్దడి వల్ల రైతులు తీవ్రంగా నష్టపోయారని అన్నారు. సిపిఎం మండల కార్యదర్శి తెల్లం రామకృష్ణ, పోలవరం మండల కార్యదర్శి కారం భాస్కర్ మాట్లాడుతూ పోలవరం పునరావాస కాలనీల గురించి మాట్లాడుతూ పోలవరం పునరావాస కాలనీల్లో రోడ్లు, డ్రెయినేజీలు, వీధిదీపాలు, తాగునీటి సరఫరా వంటి పునరావాస, మౌలిక సౌకర్యాలను పూర్తిస్థాయిలో అందించాలన్నారు. కొన్ని నిర్వాసిత కాలనీలకు కనీసం శ్మశానాలు కేటాయించకుండా ప్రభుత్వం ఇన్నాళ్లు ఏం చేస్తుందని ప్రశ్నించారు. ప్రభుత్వం పోలవరం ప్రాజెక్టు వల్ల నిరాశ్రయులైన నిర్వాసితులకు ప్రతిఒక్కరికీ పూర్తిస్థాయి ప్యాకేజీని అందజేసి భూమికి భూమి కింద ఇచ్చిన ప్రతిఒక్కరి భూములకు పూర్తిస్థాయిలో సరిహద్దులను చూపించి వివాదాలు ఉన్న భూములకు వివాదాలను పరిష్కరించి నిర్వాసితులకు అందించాలన్నారు. ఈ యాత్రలో సిపిఎం నాయకులు పోలోజు నాగేశ్వరరావు, చంద్రు బుల్లెమ్మ, కె.భీమరాజు, ఎస్.సాయికృష్ణ, శివలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యురాలు మొడియం నాగమణి

బకాయిలు చెల్లించాలని కాంట్రాక్టర్ల ధర్నా

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

ఆరు సంవత్సరాలుగా బిల్లుల చెల్లింపుల్లో జాప్యం కారణంగా తీవ్ర ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నామని ఆర్అండ్‌బి, పంచాయతీరాజ్, మున్సిపల్ కాంట్రాక్టర్లు ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక ఆర్అండ్‌బి కార్యాలయం వద్ద కాంట్రాక్టర్లు బుధవారం ధర్నా చేపట్టారు. అనంతరం ర్యాలీగా బయలుదేరి జిల్లా పరిషత్ కార్యాలయం మీదుగా కలెక్టరేట్‌కు చేరుకుని అక్కడ ధర్నా చేపట్టారు. అనంతరం జాయింట్ కలెక్టర్‌కు ఆర్అండ్‌బి ఎస్ఇకి, ఇరిగేషన్ ఎస్ఇకి, జెడ్‌పి ఎస్ఇకి వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా కాంట్రాక్టర్లు మాట్లాడుతూ రాష్ట్రంలో వేలాదిమంది కాంట్రాక్టర్లు 20కిపైగా ఇంజినీరింగ్ విభాగాల్లో పని చేస్తున్నారని, తమకు ఆరు సంవత్సరాలుగా బిల్లుల చెల్లింపుల్లో జాప్యం కారణంగా తమ కుటుంబాలు తీవ్ర ఆర్థిక ఒడిదుడుకుల్లో కొట్టుమిట్టాడుతున్నాయని వాపోయారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత సంక్రాంతిలోపు రోడ్లపై గుంతలు పూడ్చాలంటే దాదాపు 90 శాతం వరకూ పూడ్చి ఇబ్బందుల్లేకుండా చేశామన్నారు. ఇప్పటికీ పెండింగ్ బిల్లులు చెల్లించకపోవడం బాధాకరమన్నారు. పెండింగ్ బిల్లులు సకాలంలో చెల్లించడానికి వీలుగా సిఎఫ్ఎంఎస్‌లో సాంకేతిక అడ్డంకులను పరిష్కరించాలని, బకాయిలు చెల్లించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి పశ్చిమ, తూర్పుగోదావరి జిల్లాల కాంట్రాక్టర్లు, మున్సిపల్ కాంట్రాక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

ధర్నాలో పాల్గొన్న కాంట్రాక్టర్లు

శ్మశాన వాటికల సమస్యలు పరిష్కరించాలి

సిపిఎం ఆధ్వర్యాన తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా

టి.నర్సాపురంలో ధర్నా

ప్రజాశక్తి - టి.నర్సాపురం

మండలంలోని అన్ని గ్రామాల్లో శ్మశాన వాటికల సమస్యను పరిష్కరించి, అభివృద్ధి చేయాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు గుడెల్లి వెంకట్రావు డిమాండ్ చేశారు. ఈ నెల 16, 17 తేదీల్లో మండలంలో నిర్వహించిన ప్రజా చైతన్య పాదయాత్రలో యాత్ర బృందానికి ప్రజలు చెప్పిన సమస్యల పరిష్కారం కోరుతూ సిపిఎం ఆధ్వర్యంలో బుధవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద, ప్రధాన సెంటర్లో ధర్నా నిర్వహించారు. అనంతరం వివిధ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని డిటి స్రవంతికి అందజేశారు. ఈ సందర్భంగా గుడెల్లి వెంకట్రావు మాట్లాడుతూ మండలంలో అధ్వానంగా ఉన్న రోడ్లు అభివృద్ధి చేయాలని, రోడ్లు లేని గ్రామాలకు రోడ్డు సౌకర్యం కల్పించాలని కోరారు. ఆక్రమణకు గురైన శ్మశాన వాటికల్లో ఆక్రమణలు తొలగించి సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. మండలంలోని అల్లూరి సీతారామరాజునగర్ కాలనీవాసులకు 17 ఏళ్ల నుంచి గ్రామంలో కనీసం రోడ్లు, డ్రెయినేజీలు, తాగునీటి సౌకర్యం లేక గ్రామస్తులు నానావస్థలు పడుతున్నారని వాపోయారు. గ్రామంలో తాగునీరు వంటి సౌకర్యాలు కల్పించాలని, పేదల ఇళ్లస్థలాలకు ఎంజాయ్‌మెంట్లు ఇవ్వాలని హైకోర్టు ఉత్తర్వులిచ్చినా అధికార యంత్రాంగం పట్టించుకున్న దాఖలాల్లేవని మండిపడ్డారు. అధికారులు స్పందించి తక్షణమే తాగునీరు, విద్యుత్ సౌకర్యాన్ని పునరుద్ధరించాలన్నారు. పార్టీ నాయకులు నారాయణ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 9 నెలలైనా ఉద్యోగ, ఉపాధి అవకాశాల కల్పనలో విఫలమైందన్నారు. సిపిఎం నాయకులు సిరిబత్తుల సీతారామయ్య, అనుమోలు మురళి మాట్లాడుతూ మండల పరిధిలో చింతలపూడి ఎత్తిపోతల పథకం భూసేకరణలో అనేక అక్రమాలు జరిగాయని, 2013 భూసేకరణ చట్టాన్ని వర్తింపజేయకుండా రైతులను మోసగించారన్నారు. 2013 భూసేకరణ చట్టప్రకారం రైతాంగానికి, కూలీలకు నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నేతలు మడకం కుమారి, బరగడ కుమారి, శిరీష, ఇందిర తదితరులు పాల్గొన్నారు.

ఏలూరు నగరంలో యాత్ర

నగరవాసుల సమస్యలు పరిష్కరించాలి

సిపిఎం నగర కార్యదర్శి డిఎన్‌విడి.ప్రసాద్

ఏలూరు అర్బన్: ఏలూరు నగర ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు తక్షణమే పరిష్కరించాలని సిపిఎం నగర కార్యదర్శి డిఎన్‌విడి.ప్రసాద్ డిమాండ్ చేశారు. సిపిఎం ప్రజా చైతన్య యాత్రలో భాగంగా బుధవారం స్థానిక కుమ్మరిరేవు, లంకపేట ప్రాంతాల్లో పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా కుమ్మరిరేవు ప్రజలు తాము ఎదుర్కొంటున్న సమస్యలను బృందం దృష్టికి తీసుకొవచ్చారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకొచ్చి తొమ్మిది నెలలైనా నేటికీ వాగ్దానాల అమలుకు చర్యలు లేవన్నారు. సూపర్ సిక్స్ తక్షణమే అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. కుమ్మరిరేవులో నివాసం ఉంటున్న వారికి ఇళ్ల పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ ప్రాంతంలో రోడ్లు, డ్రెయినేజీలు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, తక్షణమే ఆ సౌకర్యాలు కల్పించాలని కోరారు. తాగునీరు కూడా సరిగా అందక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, జిల్లా కేంద్రంలోనే ఈ దుస్థితి ఉండటం దారుణమన్నారు. కుమ్మరిరేవు ప్రాంతంలో తాగునీటి సౌకర్యం కల్పించేందుకు యుద్ధప్రాతిపదికన తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ పాదయాత్ర బృందంలో సిపిఎం నాయకులు కె.రామాంజనేయులు, ఎం.ఇస్సాక్, కె.విజయలక్ష్మి, ఏసుబాబు, బి.సోమయ్య, ఎస్.సత్యనారాయణ, జి.శివకుమార్, ఎం.సత్యనారాయణ, దుర్గారావు, మాణిక్యాలరావు తదితరులు పాల్గొన్నారు.

డిసిసిబి ద్వారా మెరుగైన సేవలందించాలి

ప్రత్యేకాధికారి, జెసి ధాత్రిరెడ్డి

ప్రజాశక్తి - ఏలూరు

జిల్లా సహకార కేంద్ర బ్యాంకు ద్వారా రైతులకు మరింత మెరుగైన సేవలందించాలని జిల్లా జాయింట్ కలెక్టర్, జిల్లా సహకార కేంద్ర బ్యాంకు ప్రత్యేక అధికారి పి.ధాత్రిరెడ్డి అన్నారు. జిల్లా సహకార కేంద్ర బ్యాంకు మహాజన సభ స్థానిక కలెక్టరేట్లోని గోదావరి సమావేశపు హాలులో బుధవారం డిసిసిబి ప్రత్యేకాధికారి, జెసి ధాత్రిరెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల ద్వారా రైతులకు వ్యవసాయ సీజన్ సమయంలో పంట రుణాలు అందించాలని, రైతులు దరఖాస్తు చేసిన 20 రోజుల్లోగా రుణాలు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల్లో వ్యాపార కార్యకలాపాలను పూర్తిస్థాయిలో కంప్యూటరీకరించాలన్నారు. డిసిసిబి వ్యాపార పరిధిని మరింత విస్తరించి, బ్యాంకును మరింత అభివృద్ధి చేయాలన్నారు. స్వయం సహాయక సంఘాల మహిళల నుండి రుణాల రికవరీలు నూరుశాతం ఉన్నాయని, వారి స్వయం ఉపాధికి రుణాలను అందించి మహిళల ఆర్థికాభివృద్ధికి తోడ్పడాలని జెసి సూచించారు. నిరర్థక రుణాల వసూళ్లపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించి రుణాల వసూళ్లపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలన్నారు. రుణాలను సక్రమంగా చెల్లించే ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలకు ర్యాంకింగ్ విధానాన్ని అమలు చేస్తామని, వారికి వడ్డీలో కొంత మొత్తం రాయితీపై రుణాలను అందిస్తామన్నారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన రాబడి, వ్యయాలను ఆమోదించారు. 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబందించిన బడ్జెట్ ప్రతిపాదనలను కూడా సభలో ఆమోదించారు. సమావేశంలో జిల్లా సహకార శాఖాధికారి ఎ.శ్రీనివాస్, డిసిసిబి సిఇఒ సింహాచలం, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ప్రతినిధులు, సహకార శాఖ పర్సన్ ఇన్‌ఛార్జీలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

అంతరిక్ష అన్వేషణపై అవగాహన

సునీత విలియమ్స్ అంతరిక్ష ప్రయాణం ప్రొజెక్టర్‌తో ప్రదర్శన

విద్యార్థులకు ప్రొజెక్టర్ ద్వారా వివరిస్తున్న ఉపాధ్యాయులు

చింతలపూడి : అంతరిక్ష అన్వేషణ గురించి అవగాహన వ్యాప్తి చేయడం, కళాశాల విద్యార్థుల యువ మనస్సులను ప్రేరేపించడం, తరగతి గదిలోకి అత్యాధునిక శాస్త్రీయ పురోగతులు, విజయాలను తీసుకురావడానికి దోహదపడుతుందని కళాశాల భౌతిక శాస్త్ర అధ్యాపకురాలు జి.జీవన్ మౌనిక అన్నారు. చింతలపూడిలోని ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పి.శ్రీనివాసరావు అనుమతితో భౌతిక శాఖ విభాగం ఆధ్వర్యంలో విద్యార్థులు, అధ్యాపక సభ్యుల కోసం ప్రఖ్యాత వ్యోమగామి సునితా విలియమ్స్ ఇంటర్నేషనల్ స్పేస్ స్టేషన్(ఐఎస్ఎస్) అంతరిక్షంలో తొమ్మిది నెలల మిషన్ తర్వాత భూమికి తిరిగి రావడం శక్తివంతమైన చిత్రం, వీడియో ఫుటేజీని, విలియమ్స్ గడిపిన సమయంలో చిత్రీకరించిన వీడియోలను, శాస్త్రీయ పరిశోధనలు, అంతరిక్షంలో ప్రయోగాలు చేస్తున్నప్పుడు ఆమె ఎదుర్కొన్న సవాళ్లను ప్రొజెక్టర్ సహాయంతో ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విలియమ్స్ ప్రయాణం గురించి వివరణాత్మకంగా వివరించారు. చరిత్రలో అత్యంత నిష్ణాతులైన మహిళా వ్యోమగాములలో ఒకరిగా ఆమె పాత్రను పోషించారని కొనియాడారు. సునీత విలియమ్స్ వంటి వ్యోమగాముల అద్భుతమైన విజయాలను ప్రదర్శించడం ద్వారా విద్యార్థుల్లో భవిష్యత్తులో శాస్త్రవేత్తలుగా ఎదగాలనే ఆలోచన పెరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. చింతలపూడి ప్రభుత్వ డిగ్రీ కళాశాల నాణ్యమైన విద్యను అందించడానికి, విమర్శనాత్మక ఆలోచనను ప్రోత్సహించే అభ్యాస వాతావరణాన్ని సృష్టించడానికి కట్టుబడి ఉందని, అలాగే కళాశాలలో భౌతిక శాస్త్ర విభాగం విద్యార్థుల శాస్త్రీయ జ్ఞానం, నైపుణ్యాలను పెంచడంలో కీలక పాత్ర పోషిస్తుందని అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, వివిధ విభాగ అధ్యాపకులు ఖగోళ శాస్త్రంలో ఇటువంటి సాహసోపేతమైన ప్రయోగాలు నిర్వహిస్తున్న నాసాను అభినందిస్తూ కార్యక్రమాన్ని ముగించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొన్నారు.

ఉపాధి చట్టానికి బడ్జెట్లో కేటాయింపులు పెంచాలి

సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఆర్.లింగరాజు

భీమడోలు : ఉపాధి హామీ చట్టానికి బడ్జెట్లో కేటాయింపులు పెంచాలని, కూలీలకు రోజువారి రూ.600 కూలితో పాటు కనీసంగా 200 పనిదినాలు కల్పించాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఆర్.లింగరాజు కోరారు. బుధవారం ఆయన ఆధ్వర్యంలోని సిపిఎం బృందం పోలసాని పల్లి గ్రామంలో పర్యటించింది. ఉపాధి హామీ పనులు కొనసాగుతున్న ప్రాంతాలకు వెళ్లి కూలీలను కలిశారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా లింగరాజు మాట్లాడుతూ వ్యవసాయ యాంత్రీకరణ విధానం వల్ల కూలీలకు ఉపాధి పనులు తగ్గాయన్నారు. కూలీలతో పాటు వ్యవసాయ కార్మికులు, కౌలు రైతులు, పేద రైతులు ఉపాధి హామీ చట్టంలో పాల్గొని జీవనాన్ని కొనసాగిస్తున్నట్టు తెలిపారు. ఇదే నేపథ్యంలో గత రెండు నెలల కాలంగా చేసిన ఉపాధి హామీ పనులకు కూలీల బకాయిలు పెరగడంతో కూలీలు ఇబ్బంది పడుతున్నారని అన్నారు. గతంతో పోల్చుకుంటే ఉపాధి హామీ పనుల్లో పాల్గొనే కూలీలకు కనీస సౌకర్యాలను కల్పించడం లేదన్నారు. వికలాంగులకు ఉపాధి హామీ చట్టంలో స్థానం కల్పించడం లేదని ఆరోపించారు. ఇకనైనా ప్రభుత్వం ఆర్థిక మాంద్యాన్ని అదుపు చేసే క్రమంలో కూలీలకు పనులు కల్పించాలని, బకాయిలు చెల్లించాలని కోరారు. పనుల్లో పాల్గొనే కూలీలకు కనీస సౌకర్యాల కల్పనకు ప్రాధాన్యత ఇవ్వాలని అడిగారు. అనంతరం సిపిఎం బృందం 15 సంవత్సరాల క్రితం ఇళ్ల పట్టాలు ఇచ్చిన అర్జావారిగూడెంలోని ఎన్‌టిఆర్ కాలనీని సందర్శించారు. నివాసితులతో మాట్లాడారు. కనీస సౌకర్యాలు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో సిపిఎం ఆర్గనైజర్ కట్టా భాస్కరరావు పాల్గొన్నారు.

విద్యాశాఖా మంత్రి లోకేష్‌కు ఘన స్వాగతం

విద్యాశాఖా మంత్రి లోకేష్‌కు స్వాగతం పలుకుతున్న మంత్రి పార్థసారథి

నూజివీడు టౌన్ : రాష్ట్ర విద్యా, ఐటి శాఖా మంత్రి నారా లోకేష్‌కు రాష్ట్ర గృహనిర్మాణ, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారధి ఘన స్వాగతం పలికారు. గన్నవరం నియోజకవర్గం బాపులపాడు మండలం మల్లవల్లి గ్రామంలోని పారిశ్రామిక కేంద్రంలో నిర్మించిన అశోక్ లైలాండ్ కంపెనీ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి, మంత్రి నారా లోకేష్‌కు మండలంలోని మర్రిబంధం, సీతారాంపురం, పోలవరం కాలువ వారధి కూడలిలో విశేష జనాభాతో, పార్టీ కార్యకర్తలు, నాయకులతో, భారీ గజమాలతో ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో నూజివీడు నియోజకవర్గ టిడిపి కూటమి నాయకులు, కార్యకర్తలు, మహిళలు, పెద్ద ఎత్తున పాల్గొని ఘన స్వాగతం పలికారు.

కృష్ణా జిల్లా పర్యటనలో భాగంగా హనుమాన్ జంక్షన్‌లోని అభయాంజనేయస్వామి ఆలయానికి విచ్చేసిన రాష్ట్ర మానవ వనరుల అభివృద్ధి, ఐటి, ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్ శాఖల మంత్రి నారా లోకేష్‌ని కలెక్టర్ కె.వెట్రిసెల్వి బుధవారం పూల బుకేని అందించి మర్యాదపూర్వకంగా కలిశారు.

నవోదయం 2.0పై అవగాహన

ముసునూరు : నాటుసారా రహిత ఆంధ్రప్రదేశ్ కోసం ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన నవోదయం 2.0 అనే కార్యక్రమంలో భాగంగా మండలంలోని కాట్రేనిపాడు, చిల్లబోయినపల్లి, వేల్పుచర్ల, గోపవరం, ముసునూరు గ్రామాలలో అవగాహనా సదస్సు నిర్వహించినట్లు ప్రొహిబిషన్, ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ ఎ.మస్తానయ్య తెలిపారు. ఈ సదస్సుల్లో సర్పంచ్ అధ్యక్షతన గ్రామ కమిటీలను ఏర్పాటు చేసి, ఈ కమిటీల ద్వారా గ్రామంలో ఎవరైనా నాటుసారా తయారు చేసినా, అమ్మినా, రవాణా చేసినా కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు. నాటుసారా రహిత గ్రామాలుగా తీర్చిదిద్దడమే ఈ గ్రామకమిటీల లక్ష్యంగా నిర్ణయించినట్లు ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ ఎ.మస్తానయ్య తెలిపారు.

పోలవరం : మండలంలోని ఎల్ఎన్‌డి పేట గ్రామంలో నవోదయం 2.0 కార్యక్రమంలో భాగంగా నాటు సారా నిర్మూలనపై అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా అసిస్టెంట్ కమిషనర్ ఎవిఎస్.ప్రభు కుమార్ పాల్గొని అవగాహన కల్పించారు. డిపిఇఒ ఆవులయ్య, ఎస్ఐ జి.పాండురంగారావు, ఎంపిపి సుంకర వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బిసి కార్పొరేషన్ లోన్లకు దరఖాస్తుల స్వీకరణ

మండవల్లి : బిసి కార్పొరేషన్ ద్వారా లోన్లు పొందేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ఎంపిడిఒ రామలింగేశ్వరరావు తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఆయన మాట్లాడుతూ అర్హులైన ఏదేనింటు సబ్సిడీ లోన్స్ ఎంతగానో దోహదపడతాయని అన్నారు. బిసి కార్పొరేషన్ ద్వారా సబ్సిడీపై లోన్లు ఎందుకు అనుమతులు వచ్చాయని, సబ్సిడీ లోన్లపై దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని తెలిపారు. దరఖాస్తు చేసుకోదలచిన వారు మీసేవ కేంద్రంలో, కుట్టు మిషన్లకు సచివాలయంలో దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఈనెల 22 అనగా శనివారం వరకు అవకాశం కలిగిన వారు దరఖాస్తులు చేసుకోవచ్చునని తెలిపారు. దరఖాస్తు తేదీ ముగిసిన పిదప దరఖాస్తులను పరిశీలించి ఎంపిక చేయడం జరుగుతుందని ఆయన తెలిపారు.

ఎల్‌డిఒ పూర్ణిమకు వీడ్కోలు

ఏలూరు : జిల్లాలో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఎల్‌డిఒ విధులు నిర్వర్తించి కర్ణాటకకు బదిలీపై వెళుతున్న పి.పూర్ణిమకు ఘనంగా వీడ్కోలు పలికారు. స్థానిక గౌతమి సమావేశ మందిరంలో బ్యాంకర్ల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి ఆర్‌బిఐ ఎల్‌డిఒ పూర్ణిమను శాలువాతో సత్కరించి మెమెంటోను అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ జిల్లాలో బ్యాంకర్లు, జిల్లా యంత్రాంగానికి సమన్వయంగా ఉంటూ గత రెండేళ్లుగా సమర్థవంతంగా సేవలు అందించిన పి.పూర్ణిమను అభినందించారు. అదేవిధంగా లీడ్ బ్యాంక్ ఆధ్వర్యంలో యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రీజనల్ హెడ్ ఎన్.శ్రీనివాస్, ఎల్‌డిఎం డి.నీలాంద్రి పూర్ణిమను సత్కరించి జ్ఞాపికను అందజేశారు. నాబార్డు డిడిఎం అనిల్ కాంత్, వివిధ శాఖల బ్యాంక్ కంట్రోలర్లు, కో-ఆర్డినేటర్లు పాల్గొన్నారు.

32 మందికి కంటి ఆపరేషన్లు

పోలవరం : ఐటిడిఎ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో బుధవారం రాజమహేంద్రవరం గౌతమి నేత్రాలయంలో 32 మంది కంటి సమస్యల రోగులకు ఉచితంగా ఆపరేషన్లు నిర్వహించారు. ఐటిడిఎ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ఒఎన్‌జిసి వారి సౌజన్యంతో చేగొండపల్లి పునరావాస గ్రామంలో ఇటీవల నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరంలో ఆపరేషన్లు అవసరమైన వారిని సోమవారం ప్రత్యేక వాహనంలో చేగొండపల్లి గ్రామం నుంచి రాజమహేంద్రవరం తరలించారు. వారికి అవసరమైన పరీక్షలు నిర్వహించి ఆపరేషన్లు చేసి, కళ్లజోళ్లు అందజేసి వారిని వారి నివాసాలకు సొంత ఖర్చులతో తరలించినట్లు ఐటిడిఎ స్వచ్ఛంద సేవా సంస్థ డైరెక్టర్ గంగు అనిల్‌కుమార్ తెలిపారు. మరో 200 మంది అర్హులైన నేత్ర సంబంధ రోగులకు రానున్న రెండు రోజుల్లో ఉచితంగా కళ్లజోళ్లు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు.

'విలీన ప్రక్రియను విరమించుకోవాలి'

వేలేరుపాడు : ప్రభుత్వం ప్రతి మండలంలోని ప్రతి గ్రామపంచాయతీకి ఒక మోడల్ ప్రైమరీ స్కూల్ ఏర్పాటులో భాగంగా తక్కువ ఎన్రోల్మెంట్ ఉన్న బడుల్లో విద్యార్థులను ఒక చోటుకి తరలించే ప్రక్రియ చేపట్టారు. ఈ పాఠశాలలు, తరగతుల విలీన ప్రక్రియను వ్యతిరేకిస్తూ ఆంధ్రప్రదేశ్ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి ధర్ముల రమేష్ పత్రిక ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ప్రభుత్వ పాఠశాలలు మూసివేత వైపే ప్రభుత్వం అడుగులు వేస్తుందన్నారు. ఎంతో శ్రమకోర్చి తెచ్చుకున్న బడులను సర్కారు విలీనం వైపు నడిపిస్తుందని విమర్శించారు. ఇందుకు గ్రామస్తులు అంగీకరించకపోయినా స్కూల్ మేనేజ్మెంట్ కమిటీలు 'నో' అని చెప్పిన 'ఎస్' అనిపించాల్సిన బాధ్యత ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులదేనని ఆదేశించడం అంటే వాళ్లు పనిచేస్తున్న పాఠశాలను వారితోనే మూసేవేసే పని చేపిస్తున్నారని ఎద్దేవా చేశారు. బలవంతంగా ఎస్ఎంసిలతో తీర్మానాలు చేసి మోడల్ స్కూల్స్ తీసుకొని రావాలని చూస్తే పెద్ద ఎత్తున గ్రామస్తులను సమీకరించి అడ్డుకుంటామని తెలియజేశారు.

యాకోబుపై దాడికి కారకులను శిక్షించాలి : పిడిఎస్‌యు

బుట్టాయగూడెం : పదిరోజుల క్రితం మడకం యాకోబు అనే గిరిజనుడిని ఫారెస్ట్ డిపార్ట్మెంట్ అధికారులైన వెంకటసుబ్బయ్య, శివరామకృష్ణ, పోసిబాబులు దాడిచేసి తీవ్రంగా గాయపరచారని పిడిఎస్‌యు మాజీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.రామ్మోహన్ అన్నారు. వారిపై ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ, హత్యాయత్నం కేసు నమోదు చేసి శిక్షించాలని డిమాండ్ చేశారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పది రోజుల క్రితం దొర మామిడి పంచాయతీ గుల్లపూడి గ్రామానికి చెందిన మడకం యాకోబును ఫారెస్ట్ అధికారి కార్యాలయానికి రమ్మని చెప్పి, వెళ్లిన యాకోబును గదిలో నిర్బంధించి తీవ్రంగా హింసించిన అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు.

చెరువులో పడి మత్స్యకారుడు మృతి

మండవల్లి : బతుకుతెరువు నిమిత్తం చేపల పట్టుబడికి వెళ్లి ప్రమాదవశాత్తూ చెరువులో పడి ఒక వ్యక్తి మృతిచెందిన సంఘటన రెవెన్యూ పిల్లిపాడు గ్రామంలో బుధవారం ఉదయం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కైకలూరు మండలం గోపవరం గ్రామానికి చెందిన పుట్టపు కనకసూర్య మహేశ్వరరావు(48) చేపల పట్టుబడులకు వెళుతూ జీవనం సాగిస్తుంటాడు. రెవెన్యూ గ్రామమైన పిల్లిపాడులో భైరవపట్నం బాబికి చెందిన 27 ఎకరాల చెరువులో ఫంగస్ చేపలను పట్టేందుకు బుధవారం ఉదయం 49 కూలీలతో కలసి చెరువు వద్దకు వచ్చాడు. చెరువులో వలపరిచి మూడు మీటర్లకు ఒక వ్యక్తి చొప్పున నిలబడి వలను లాగుతుండగా గట్టుకు సమీపాన మూడవ వ్యక్తిగా ఉన్న కనక సూర్య మహేశ్వరరావు వల లాగుతూ ప్రమాదవశాత్తూ సుమారు 6:20 నిమిషాలకు చెరువులోకి మునిగిపోయాడు. ఇది గమనించిన తోటి వ్యక్తులు కేకలు వేస్తూ అతన్ని కాపేడేందుకు ప్రయత్నించినప్పటికీ మునిగిపోయిన ప్రాంతంలోనే అతను కనిపించకపోవడంతో వలల సహాయంతో వెతకడం ప్రారంభించారు. చెరువు మధ్యలో సూర్య మల్లేశ్వరరావు మృతిచెంది వలకు చిక్కాడు. దీంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించడంతో సంఘటనా స్థలంకి చేరుకున్న పోలీసులు భార్య నాగమణి ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసుకుని మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి, బంధువులకు అప్పగించినట్లు ఎస్ఐ రామచంద్రరావు తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

జీలుగుమిల్లి : మండలంలోని తాటియాకులగూడెం గ్రామంలో మంగళవారం తెల్లవారు జామున గుర్తు తెలియని వ్యక్తుల చేతిలో కత్తి దాడికి గురైన ఘటనలో తీవ్ర గాయాల పాలై అపస్మారక స్థితిలో వెళ్లిన గంధం బోస్(36) ఖమ్మంలోని ప్రయివేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ బుధవారం సాయంత్రం మృతిచెందినట్లు కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపారు. మృతిచెందిన వ్యక్తికి భార్య, ఇద్దరు పిల్లలు సంతానంగా తెలిపారు.

ఇదిలా ఉండగా కత్తిదాడి కేసుకు సంబంధించి పోలవరం డిఎస్‌పి ఎమ్.వెంకటేశ్వరావు, సిఐ బి.వెంకటేశ్వరావు ఆధ్వర్యంలో విచారణ చేపట్టారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు, కాల్ డేటా ఆధారంగా అనుమానాస్పదంగా ఉన్న పలువురిని సిఐ కార్యాలయంలో విచారణ నిర్వహిస్తున్నట్లు చెబుతున్నారు.

ఆరుగురిపై బైండోవర్

ముసునూరు : మండలంలో ఎవరైనా నాటుసారా తయారు చేసినట్లయితే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ప్రొహిబిషన్, ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ ఎ.మస్తానయ్య అన్నారు. మండల పరిధిలోని చింతలవల్లి గ్రామానికి చెందిన పల్లిపాము పద్మ కుమారి, చెక్కపల్లి గ్రామానికి చెందిన తాళంరాజు, వేల్పుచర్ల గ్రామానికి చెందిన వడిత్యా పెద్దలక్ష్మి, గుల్లపూడి గ్రామానికి చెందిన నారిపెళ్ల సత్యవతి, చిల్లబోయినపల్లి గ్రామానికి చెందిన మరీదు రవి, గుల్లపూడి గ్రామానికి చెందిన మరీదు నాగబాబు అను ఆరుగురిని ముసునూరు తహశీల్దార్ కె.రాజ్ కుమార్ ఎదుట బైండోవర్ చేశారు. ఈ సందర్భంగా ఈ బైండోవర్ కాలపరిమితి సంవత్సరం వరకు ఉంటుందని, వీరు మరలా నేరాలకు పాల్పడితే పాల్పడిన వారి వద్ద నుంచి రూ.లక్ష జరిమానా, ప్రభుత్వ పథకాలను రద్దు చేయడం జరుగుతుందని తహశీల్దార్ హెచ్చరించినట్లు ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ ఎ.మస్తానయ్య తెలిపారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

14 ఏళ్లయినా పూర్తికాని భవన నిర్మాణం

నిధుల లేమితో నిలిచిన డిఎస్‌పి కార్యాలయ నిర్మాణ పనులు
మంత్రి స్పందించాలని ప్రజలు, సామాజిక వేత్తల వేడుకోలు

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

నూజివీడు పట్టణంలో 2010లో చేపట్టిన డిఎస్‌పి కార్యాలయ భవన నిర్మాణం ఇప్పటికీ పూర్తి కాలేదు. నిర్మాణ పనులు చివరి దశకు చేరుకున్నాయి. నిధుల లేమితో నిలిచిన పనులు 14 ఏళ్లు పూర్తయినా మళ్లీ ప్రారంభం కాలేదు. త్వరగా డిఎస్‌పి కార్యాలయాన్ని పూర్తిచేసి అందుబాటులోకి తీసుకురావాలని నూజివీడు ప్రజలు, ప్రజాసంఘాల నేతలు కోరుతున్నారు.

నూజివీడు పట్టణంలో 2010లో అప్పటి ఎంఎల్ఎ చిన్నం రామకోటయ్య రూ.తొమ్మిది లక్షలు, అప్పటి ఎంఎల్‌సి పాలడుగు వెంకట్రావు రూ.ఐదు లక్షల నిధులతో డిఎస్‌పి కార్యాలయం నిర్మాణం చేపట్టారు. ఆ నిధులతో ఒక ఫ్లోర్ నిర్మాణం పూర్తయింది. అనంతరం వైసిపి పాలన వచ్చిన తరువాత 2020లో అప్పటి ఎంఎల్ఎ మేకా వెంకట ప్రతాప్ అప్పారావు, అప్పటి మైలవరం ఎంఎల్ఎ వసంత వెంకటకృష్ణప్రసాద్, అప్పటి తిరువూరు ఎంఎల్ఎ రక్షణ నిధులు నియోజకవర్గానికి రూ.పది లక్షల చొప్పున మొత్తం రూ.30 లక్షలతో గ్రౌండ్ ఫ్లోర్ ప్లస్ రెండు అంతస్తుల నిర్మాణాన్ని చేపట్టారు. మళ్లీ ఎన్నికలు పూర్తయిన తర్వాత కూటమి ప్రభుత్వం రాగానే రాష్ట్ర గృహనిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖా మంత్రి కొలుసు పార్థసారధి కొందరు మిత్రుల తోడ్పాటుతో రూ.ఐదు లక్షలతో కొద్దిపాటి పనులు కొనసాగించారు. పట్టణంలో సుమారు 620 గజాల సువిశాల ప్రాంగణంలో కార్యాలయ నిర్మాణ పనులు చేపట్టారు. నిధుల లేమి కారణంగా నిర్మాణాలు అర్ధాంతరంగా నిలిచిపోయాయి. ప్రజాప్రతినిధుల సహకారంతో కొనసాగుతున్న ఈ నిర్మాణానికి పోలీసు శాఖ నుంచి ఏవిధంగా నిధులు కేటాయించే అవకాశం లేకపోవడంతో ఎప్పుడు నిర్మాణం పూర్తి చేస్తారా అని పోలీసు ఉన్నతాధికారులు సైతం వేచి చూడక తప్పడం లేదు.

అసంపూర్తిగా నిలిచిన డిఎస్‌పి కార్యాలయం నిర్మాన పనులు

నూజివీడు నియోజకవర్గం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న రాష్ట్ర గృహనిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి చొరవ చూపితేనే డిఎస్‌పి కార్యాలయ నిర్మాణం పూర్తి చేసుకుని, అన్ని హంగులతో ప్రారంభోత్సవానికి సిద్ధం కాగలదని పలువురు సామాజిక వేత్తలు వ్యాఖ్యానిస్తున్నారు.

రెండో రోజు పది పరీక్షలు ప్రశాంతం

టి.నరసాపురం : మండలంలో రెండో రోజు పది పరీక్షలు ప్రశాంతంగా జరిగినట్లు ఎంఇఒ టి.రామమూర్తి తెలిపారు. బుధవారం మండలంలోని మూడు పరీక్షా కేంద్రాలలో జరిగిన హిందీ పరీక్షకు మండలంలోని బొర్రంపాలెం హైస్కూల్లో మొత్తం 221 మంది విద్యార్థులకు 12 మంది గైర్హాజరు కాగా 209 మంది హాజరయ్యారు. టి.నర్సాపురం హైస్కూల్లో 177 మందికి ఐదుగురు గైర్హాజరు కాగా 172 మంది హాజరయ్యారు. అప్పలరాజు గూడెంలో 75 మంది నూరుశాతం హాజరయ్యారని ఎంఇఒ తెలిపారు. **కలిదిండి :** పదవతరగతి హిందీ పరీక్షకు పదకొండు మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. మండలంలో ఐదు పరీక్షా కేంద్రాలు కేటాయించగా ఆరుతెగలపాడు జెడ్‌పి పాఠశాలలో 180 మంది విద్యార్థులకుగాను 177 మంది, కలిదిండి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 261 మందికి 257 మంది, కోరుకొల్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 209 మందికి 205 మంది, భాస్కరరావు పేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 95కి 95 మంది, కలిదిండి శశి హైస్కూల్‌లో 88కి 88 మంది విద్యార్థులు హిందీ పరీక్ష రాసినట్లు ఎంఇఒ అల్లూరి రవిప్రకాష్ తెలిపారు. మొత్తంగా 833 మంది విద్యార్థులు హిందీ పరీక్ష రాయవలసి ఉండగా 822 మంది పరీక్ష రాయగా 99 శాతం హాజరు నమోదైందన్నారు. **ముసునూరు :** 10వ తరగతి పరీక్షలు బుధవారం మండలంలోని ముసునూరు, గోపవరం, చెక్కపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 593 మంది విద్యార్థులకు 11 మంది హిందీ పరీక్షకు గైర్హాజరు కాగా 582 మంది పరీక్షకు హాజరైనట్లు మండల విద్యాశాఖ అధికారి బివిఎస్.సుబ్బారావు తెలియజేశారు.

ఎంపిడిఒగా శ్రీనివాస్ బాధ్యతల స్వీకరణ

పోలవరం : పోలవరం ఎంపిడిఒగా పోలవరం గ్రామానికి చెందిన చెరుకూరి శ్రీనివాస్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకూ బాధ్యతలు నిర్వహించిన ఇఒఎస్ఆర్ శ్రీనివాస్ ఇఒపిఆర్‌డిగా బాధ్యతలు తీసుకోగా జిల్లా పరిషత్ సిఇఒ ఆదేశాల మేరకు ఎఒగా బాధ్యతలు నిర్వర్తిస్తున్న చెరుకూరి శ్రీనివాస్ బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఈయన పోలవరం ఇన్‌ఛార్జి ఎంపిడిఒగా పనిచేశారు. ఎంపిడిఒగా బాధ్యతలు స్వీకరించడం పట్ల పలువురు నాయకులు, అధికారులు శ్రీనివాస్‌కి శుభాకాంక్షలు తెలిపారు.

విఒఎ కుటుంబానికి పరామర్శ

జీలుగుమిల్లి : మండలంలోని ములగలంపల్లి గ్రామ విఒఎ శ్యామల కుమారి ఇటీవల మరణించడంతో ఆమె కుటుంబాన్ని బుధవారం సిఐటియు రాష్ట్ర నాయకురాలు ఎస్‌కె.సుభాషిని, సిఐటియు మండల నాయకులతో కలిసి పరామర్శించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం సుభాషిణి మాట్లాడుతూ శ్యామల కుమారికు వ్యక్తిగతంగా ఎన్ని పనులున్నా సిఐటియు మీటింగ్ పెట్టినా, ధర్నా చేసినా తప్పకుండా హాజరయ్యే వారని ఆమె సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి సిహెచ్.కొండలరావు, నాయకులు రమణ, మస్తాన్ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు

ఏలూరు సిటీ: ఎన్ని ఆర్థిక ఇబ్బందులెదురైనా సూపర్ సిక్స్ పథకాలన్నింటినీ సక్సెస్‌ఫుల్‌గా అమలు చేసే బాధ్యతను కూటమి ప్రభుత్వం సమర్థవంతంగా నిర్వహిస్తోందని ఏలూరు ఎంఎల్ఎ బడేటి చంటి స్పష్టం చేశారు. ప్రజాసమస్యల పరిష్కారానికి కూడా సత్వర చర్యలు చేపట్టినట్లు వెల్లడించారు. ఏలూరులోని ఎంఎల్ఎ క్యాంపు కార్యాలయంలో బుధవారం వినతులందించేందుకు వచ్చిన వారితో అండగా ఉంటానని హామీ ఇచ్చారు. ఆయా సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. టిడిపి నాయకులు చిరంజీవి, త్రిపర్ణ రాజేష్ పాల్గొన్నారు.

శక్తి యాప్‌పై అవగాహన

ఏలూరు స్పోర్ట్స్: శక్తి యాప్ ద్వారా కలిగే ప్రయోజనాలు ప్రజల్లోకి తీసుకువెళ్లడమే ధ్యేయంగా శక్తి టీమ్ పనిచేస్తుందని ఏలూరు మహిళా పోలీస్ స్టేషన్ సిఐ సుబ్బారావు తెలిపారు. నెల్లూరు నగరంలోని ఎన్ఆర్ పేట ప్రాంతంలో గల ఎన్నార్ై కళాశాలలో బుధవారం మహిళా పోలీస్ స్టేషన్ సిఐ సుబ్బారావు ఆధ్వర్యంలో ప్రత్యేక శక్తి యాప్‌పై ప్రత్యేక అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సిఎస్.సుబ్బారావు విద్యార్థినులను ఉద్దేశించి మాట్లాడుతూ మహిళల భద్రత కోసం ప్రత్యేకంగా రూపొందించబడిన యాప్ శక్తి యాప్ అని వారికి గుర్తు చేశారు. అంతేకాకుండా అత్యవసర పరిస్థితుల్లో ఉన్న మహిళలు, విద్యార్థులు, బాలికలు, వృద్ధులు ఎవరైనా సరే ఈ శక్తి యాప్‌లో ఉన్న ఎస్ఒఎస్ కాల్స్ ఆధారంగా ఫిర్యాదు చేయవచ్చునని, తద్వారా శక్తి టీమ్ క్షణాల్లో ఆపదలో ఉన్న వారి వద్దకు చేరుకుంటుందని ఆయన తెలిపారు.

తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు

జెడ్‌పి చైర్‌పర్సన్ పద్మశ్రీ ప్రసాద్

భీమడోలు : జిల్లా వ్యాప్తంగా తాగునీటి సమస్యల పరిష్కారానికి తగు చర్యలు తీసుకున్నట్లు ఉమ్మడి జిల్లాల జెడ్‌పి చైర్‌పర్సన్ పద్మశ్రీ ప్రసాద్ తెలిపారు. బుధవారం సాయంత్రం మండలంలోని జెడ్‌పి చైర్‌పర్సన్, జిల్లా పంచాయతీ అధికారితో కలిసి పర్యటించారు. పర్యటనలో భాగంగా తొలుత గుండుగొలను గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలించారు. అక్కడ పనితీరు, వర్మీ కంపోస్ట్ ఎరువు తయారీ, ఇతర విషయాల గురించి ఎంపిడిఒ పద్మావతి దేవి, గ్రామపంచాయతీ కార్యదర్శి మురళీ వివరించారు. ఆ తరువాత నిర్వహించిన వన మహోత్సవంలో భాగంగా పద్మశ్రీ మొక్కలు నాటారు. గ్రామ పంచాయతీల పరిధిలో శానిటేషన్ డ్రైవ్ నిర్వహించాలని కోరారు. కార్యక్రమంలో భీమడోలు పంచాయతీ విస్తరణ అధికారి ఎ.సుందరి, కూటమి నాయకులు ఎస్.కొండబాబు పాల్గొన్నారు.

ఎస్‌సి వర్గీకరణ హేయం

ఏలూరు సిటీ : రాష్ట్ర ప్రభుత్వం ఎస్‌సి వర్గీకరణ విషయంలో అన్నదమ్ముల లాంటి తమ మధ్య చిచ్చు రేపుతోందని దళిత సంఘాల నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. ఏలూరులోని ఇండోర్ స్టేడియం వద్ద గల లేడీస్ లయన్స్ క్లబ్‌లో బుధవారం పత్రికా సమావేశం నిర్వహించారు. దళిత సంఘం నాయకులు మాట్లాడుతూ జనాభా ప్రాతిపదికన ఎస్‌సి వర్గీకరణ జరగాలని డిమాండ్ చేశారు. సుప్రీంకోర్టు ఆదేశాలను అనుసరించకుండా ప్రభుత్వం ఎస్‌సి వర్గీకరణ చేస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. మాలలకు అన్యాయం జరగకుండా చూడాలని విజ్ఞప్తి చేశారు.

ఘనంగా కాగుపాడు పాఠశాల వార్షికోత్సవం

ప్రజాశక్తి - ఉంగుటూరు

మండలంలోని కాగుపాడు నెం.2 పాఠశాల వార్షికోత్సవం ప్రధానోపాధ్యాయులు ఆనందకుమార్, ఎస్ఎంసి చైర్మన్ వైబోయిన త్రినాథ్, ఉపాధ్యాయులు పోతురాజు ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. బాలబాలికల సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. ప్రహ్లాదుడు నాటిక విద్యార్థులు, ఉపాధ్యాయులు హరికృష్ణ అద్భుతంగా ప్రదర్శించారు. గ్రామ పెద్దలు కడియాల రవిశంకర్, కడియాల జానకీరామ్, మట్టా వెంకటేశ్వరరావు, యూటిఎఫ్ మండల శాఖ తరపున సీతాల సత్యనారాయణ, ఉనుముల రాంబాబు, డాకి జోగినాయుడు, సిహెచ్.శ్రీధర్, పుప్పాల నరసింహారావు, తూతిక శివయ్య, బొమ్మిడి ప్రసాద్, ప్రేమ్‌కుమార్, లక్ష్మీనారాయణ, ఉపాధ్యాయ బృందం, ప్రజలు, నాయకులు, పాఠశాల సిబ్బందిని అభినందించారు. అనంతరం గ్రామ పెద్దలకు, రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయులు కత్తుల ఝాన్సీ, అల్లుశ్రీను, సిరిమామిళ్ల పెద్దిరాజులను సన్మానించారు.

సాంస్కృతిక వేషధారణలో విద్యార్థులు

అప్రకటిత విద్యుత్ కోతలు - ప్రజల అవస్థలు

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

వేసవి తాపం ప్రారంభంలోనే విద్యుత్ కోతలతో ప్రజానీకం విలవిల్లాడుతున్నారు. మండలం వ్యాప్తంగా గత కొన్ని రోజులుగా అప్రకటిత విద్యుత్ కోతలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బయటకెళ్తే ఎండ తీవ్రత అధికంగా ఉండటం, ఇంట్లో ఉంటే విద్యుత్ అంతరాయలతో అవస్థలు పడుతున్నారు. రైతాంగానికి ఇచ్చే విద్యుత్ సరఫరాలో కూడా తీవ్ర ఆటంకం ఏర్పడుతుండటంతో కరెంట్ కోసం పడిగాపులు కాయాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని రైతులు అవస్థలు పడుతున్నారు. వేసవి తాపం ప్రారంభంలోనే ఈవిధంగా కోతలు విధిస్తే రాబోవు రోజుల్లో ఎండ వేడిమికి మరింత ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని వినియోగదారులు వాపోతున్నారు.

వెంకటాద్రిగూడెంలో 'పొలం పిలుస్తుంది'

చింతలపూడి : మొక్కజొన్న, వరి, ఆయిల్ పామ్ పంటలలో వివిధ పురుగులు, తెగుళ్ల గురించిన రైతులకు ఆచార్య ఎన్‌జి.రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలోని ఏరువాక కేంద్రం, ఏలూరు సమన్వయ కర్త డాక్టర్ కె.ఫణి కుమార్, శాస్త్రవేత్త(విస్తరణ) ఎన్.నాగేంద్ర బాబు సందేహాలను నివృత్తి చేశారు. మండలంలోని వెంకటాద్రిగూడెం గ్రామంలో మండల వ్యవసాయాధికారిని కె.మీన ఆధ్వర్యంలో నిర్వహించిన పొలం పిలుస్తుంది కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సమన్వయ కర్త డాక్టర్ కె.ఫణి కుమార్, ఎన్.నాగేంద్ర బాబు వరిని నేరుగా వెదజల్లే పద్ధతి, సాగు విధానాన్ని వివరించి అవగాహన కల్పించారు. మండల వ్యవసాయాధికారిని మీన మాట్లాడుతూ ప్రతీ రైతు విశిష్ట సంఖ్య నమోదు చేసుకోవాలని, అలాగే ఖర్చు తగ్గించుకునే విధంగా రైతులు వ్యవసాయం చేయాలని, ప్రభుత్వం అందించే పథకాలను సరైన విధంగా ఉపయోగించుకుని అధిక లాభాలు పొందాలని సూచించారు. రేచర్ల గ్రామంలో ఏరువాక కేంద్రం ఏలూరు వారు వేరుశనగలో కొత్త రకం టిసిజిఎస్ 1694పై నిర్వహిస్తున్న క్షేత్ర పరిశీలన క్షేత్రాన్ని సందర్శించి రకం గుణగణాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో వెంకటాద్రిగూడెం రైతు సేవా కేంద్రం సిబ్బంది అజయ్, రేచర్ల రైతు సేవా కేంద్రం సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ కూలీలకు 200 రోజులు పని కల్పించాలి

సిపిఎం ఆధ్వర్యాన గ్రామ కార్యదర్శి నాగరాజుకు వినతి

చాట్రాయి : మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న కూలీలకు 200 రోజులు పనిదినాలు కల్పించాలని, కూలి రూ.600 చెల్లించాలని మండల కేంద్రమైన చాట్రాయి గ్రామ సచివాలయంలో సిపిఎం ఆధ్వర్యంలో గ్రామ కార్యదర్శి ఎం.నాగరాజుకు బుధవారం వినతిపత్రం సమర్పించారు. అనంతరం ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి మేడిపల్లి హెూలీ మేరీ మాట్లాడుతూ ఉపాధి హామీ కూలీలు పనిచేసే సమయంలో ప్రమాదం జరిగినప్పుడు ఉపయోగించే ఫస్ట్ ఎయిడ్ కిట్టు ఇవ్వాలని, మంచినీటి సౌకర్యం కల్పించాలని, టెంట్ వేయించాలని, ప్లేసిప్పులు ఇవ్వాలని, పలుగు పార తట్టకు అదనపు వేతనం ఇవ్వాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ సభ్యులు ఆడిమెల్లి లాజరు, ఉపాధి హామీ కూలీలు కుక్కమల్ల అబ్రహం, సుందూరి సంజీవరావు, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.



వినతిని అందజేస్తున్న సిపిఎం నాయకులు

నేడు కోకో రైతుల రాష్ట్ర సదస్సు

ఏలూరు అర్బన్ : ఈనెల 20వ తేదీన విజయరాయిలో జరుగుతున్న కోకో రైతుల రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి కె.శ్రీనివాస్ విజ్ఞప్తి చేశారు. బుధవారం స్థానిక అన్నే భవనంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ ఈనెల 20న ఉదయం 10 గంటలకు పెదవేగి మండలం విజయరాయి, గాంధీనగర్ సీతారామ కళ్యాణ మండపంలో కోకో రైతుల రాష్ట్ర సదస్సు నిర్వహిస్తున్నామని చెప్పారు. ఈ సదస్సుకు రైతు సంఘాల రాష్ట్ర నాయకులను, ఏలూరు జిల్లాతో పాటు కోకో సాగు జరుగుతున్న తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, కోనసీమ, కాకినాడ, అనకాపల్లి, శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల నుంచి కోకో రైతులను ఆహ్వానించామని వివరించారు. అన్ని ప్రాంతాల నుంచి కోకో రైతులు పెద్ద సంఖ్యలో తరలి రావాలని విజ్ఞప్తి చేశారు. కోకో గింజల కొనుగోలు సమస్య తీవ్రంగా ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. కంపెనీలు కోకో గింజలు కొనుగోలు చేసే విధంగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టాలని కోరారు. ఈ రాష్ట్ర సదస్సులో భవిష్యత్ కార్యాచరణ నిర్ణయిస్తామని తెలియజేశారు.

టి.నరసాపురం : కోకో రైతులందరూ సంఘటితం కావాలని ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం జిల్లా సహాయ కార్యదర్శి సిరిబత్తుల సీతారామయ్య పిలుపునిచ్చారు. బుధవారం రైతుసంఘం ఆధ్వర్యంలో స్థానిక ప్రజాసంఘాల కార్యాలయంలో రైతుసంఘం మండల కార్యదర్శి అనుమోలు మురళీ అధ్యక్షతన మండల కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పాల్గొన్న సీతారామయ్య మాట్లాడుతూ కోకో రైతుల రాష్ట్ర సదస్సుకు రైతులందరూ పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో పి.వెంకటేశ్వరరావు, పాయం చిన లక్ష్మడు, బరగడ అగ్గి రాముడు ఉన్నారు.

పీజీ సెంటర్ పరిశీలన

నూజివీడు టౌన్ : నూజివీడు పట్టణంలోని కృష్ణా యూనివర్సిటీ డాక్టర్ ఎంఆర్ఎఆర్ పీజీ స్టడీస్ సెంటర్‌ను కృష్ణా యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ కె.రాంజీ బుధవారం సందర్శించారు. పీజీ సెంటర్‌లో ఉన్న వసతి సౌకర్యాలను పరిశీలించి, అవసరమైన అంశాలను అడిగి తెలుసుకున్నారు. కావలసిన మరికొన్ని భవనాలపై నివేదికలు తయారు చేయాలని అధికారులను ఆదేశించారు. బాలికల హాస్టల్ వసతి సౌకర్యాలు, మెస్, మరుగుదొడ్లు, నడక ప్రదేశాలను సునిసితంగా పరిశీలించారు. అభివృద్ధి చేసేందుకు కావలసిన ప్రణాళికలు రూపొందించి నివేదిక అందించాలని అధికారులను ఆదేశించారు.

విద్యార్థులకు ఇకపై మొదటి సంవత్సరంలో రెండు నెలల ఇంటన్షిప్ ఏర్పాటు చేస్తామని కృష్ణా యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ రాంజీ తెలిపారు. సమీపంలోని గ్రామాలను దత్తత తీసుకొని, అక్కడి సమస్యలను ముందుగా సేకరించడం జరుగుతుందన్నారు. సమస్యల పరిష్కారం దిశగా ఆయా గ్రామాలలోని ప్రజలకు అన్ని రకాల సేవలు విద్యార్థులు అందిస్తారని వివరించారు. నూజివీడు పరిసర ప్రాంతాలలో విద్యా ప్రదాత రాష్ట్ర మాజీ మంత్రి, ఆంధ్ర యూనివర్సిటీ మాజీ వైస్ ఛాన్సలర్ డాక్టర్ ఎంఆర్.అప్పారావు హయాంలో సుభిశాలమైన ప్రాంగణాన్ని యూనివర్సిటీకి భవనాలతో సహా అందిస్తే, పీజీ సెంటర్ కాస్త స్టడీ సెంటర్‌గా మార్చి స్పెషల్ ఆఫీసర్ స్థాయి నుంచి ప్రిన్సిపల్ స్థాయికి తగ్గించడాన్ని విలేకరులు యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ రాంజీని ప్రశ్నించారు. దీనికి సమాధానంగా ఇకపై అలా జరగదని, మొత్తం క్యాంపస్ డాక్టర్ ఎంఆర్.అప్పారావు పీజీ సెంటర్‌గానే కొనసాగుతుందన్నారు. క్యాంపస్ లోపల ఉన్న కళాశాలకు మాత్రమే స్టడీ సెంటర్‌గా నామకరణం ఉంటుందన్నారు. ఇది ఏమాత్రం పీజీ సెంటర్‌ను తక్కువ చేయడం కాదని, ఆయా బ్లాకులకు పెట్టే నామకరణాలుగా మాత్రమే చూడాలని వీసి రాంజీ వివరించారు. తాను ముందుగా డాక్టర్ బిఆర్.అంబేద్కర్ యూనివర్సిటీకి పూర్తిస్థాయి వైస్ ఛాన్సలర్‌గా, నాగార్జున విశ్వవిద్యాలయానికి ఉప కులపతిగా అదనపు బాధ్యతలు నిర్వర్తించినట్లు వివరించారు.

CHANGE OF NAME

I, **YENDRAPU NARESH**, S/o.Yendrapu Nukaraju, Resident of D.No.13-20-42, Nallam Vari Thota, Near Nallam Vari School Gunupudi, Bhimavaram Town and Mandal, West Godavari (AP). Do here by declare that I have changed my name from **VANDRAPU NARESH** , S/o.Vandrapu Nukaraju (Old Name as per 10th and Inter Certificates) to **YENDRAPU NARESH,** S/o.Yendrapu Nukaraju (New Name) for Future all purposes.

నోటీసు
మహారాజశ్రీ చిలకలూరిపేట ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్)వారి కోర్టులో
ఐ.ఎ.నెం.882/2024 ఇన్ ఓ.యస్.నెం.46/2020
బిట్వీన్:
కురివెళ్ళ లక్ష్మీ కోటేశ్వర రావు వగైరాలు .....పిటీషనర్లు/వాదులు
మరియు
కురివెళ్ళ వెంకట కోట నగేష్ కుమార్ ...... రెస్పాండెంటు/ప్రతివాది
టు,
కురివెళ్ళ వెంకట కోట నగేష్ కుమార్, తండ్రి.కృష్ణా రావు, కేరాఫ్: లక్ష్మీ మెడికల్స్,వీరవాసం(గ్రామం & మండలం) పశ్చిమ గోదావరి జిల్లా.
పై నెంబరు ఫైనల్ డిక్రీ పిటీషనులో రెస్పాండెంటు అయిన మీకు శ్రీకోర్టువారి ద్వారా నోటీసులు పంపించినను మీకు ముట్టనందున శ్రీ కోర్టువారు మీకు Substitute Service ద్వారా పేపరులో ప్రకటన ద్వారా నోటీసు తెలియజేయమని ఆర్డరు వేస్తూ ది.11-04-2025కి వాయిదా వేసినారు.కావున వాయిదా రోజు ఉ. గం.10.30 ని.లకు పై తెలిపిన కోర్టునకు మీరు స్వయంగా కానీ,మీ అడ్వకేటు ద్వారా గాని హాజరై మీకు గల ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేనిచో శ్రీకోర్టు వారిచే దావా మీపరోక్షముగా విచారించి తీర్మానించబడును.
(శ్రీకోర్టువారిఉత్తర్వులప్రకారము)
వాయిదాతేది:11-04-2025
కె.వి.ఆర్.హెచ్.ప్రసాద్,
రవీంద్ర నగర్, గుంటూరు,

ప్రకటన
మహారాజశ్రీ అదనపు సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) ఏలూరు వారి కోర్టులో
O.S.No.605/2014
వాది : శ్రీమతి గొర్రెల సింహాచలం
ప్రతివాదులు :
శ్రీమతి గొట్టపు సూర్యకాంతం వగైరా
టు
D3 : గొట్టపు మోహనరావు
పోతురాజు, డోరునెం.5-75,
బస్టాండ్ వద్ద, భీమడోలు.
పై నంబరు దావా 3వ ప్రతివాది గొట్టాపు మోహనరావు హాజరు నిమిత్తం ది.**1-4-2025**వ తేదీకి వాయిదా వేసినారు. కావున 3వ ప్రతివాది ది.**1-4-2025**వ తేది ఉదయం గం.10.30 గంటలకు పైకోర్టులో స్వయంగా గాని, ప్లీడరు గారి ద్వారా గాని హాజరు కావలెను. లేనిఎడల పై దావా 3వ ప్రతివాది పరోక్షంలో తీర్మానించబడును.
బి.గౌరిశంకర్
శ్రీమతి ఎ.శోభారాణి
అడ్వకేట్స్, ఏలూరు.

మహారాజశ్రీ భీమవరం కొవ్వూరు 9వ అదనపు జిల్లా మరియు సెషన్స్ జడ్జి వారి కోర్టులో
ఒ.ఎస్.నెం.46/2014
వాదులు :
1.తాడిమళ్ళ సుబ్రహ్మణ్య బ్రహ్మాజీరావు (డైడ్)
2.తాడిమళ్ళ సూర్య కుమారి దేవి
3.తాడిమళ్ళ వెంకట శ్రీరామచంద్రమూర్తి (డైడ్)
4.పెద్దాడ శ్రీవాణి
5.తాడిమళ్ళ వెంకట జ్యోతి లక్ష్మణ్
6.తాడిమళ్ళ శ్రీరామ పద్మావతి
7.తాడిమళ్ళ సుబ్రహ్మణ్య సూర్య భార్గవ్
8.తాడిమళ్ళ సుబ్రహ్మణ్య సూర్య భరత్
ప్రతివాదులు :
1.ప్రోతాప్రగడ ఉమామహేశ్వరరావు అనే మహేష్ (డైడ్)
2.ప్రోతాప్రగడ సూర్యనారాయణ
3.ప్రోతాప్రగడ సూర్యకుమారి
4.ప్రోతాప్రగడ సుబ్రహ్మణ్య మురళీకృష్ణ కుమార్
5.ప్రోతాప్రగడ ప్రసన్న
వాదుల తరపున దాఖలు చేసుకున్న పేపరు ప్రకటన
యిందుమూలముగా తెలియజేయునది ఏమనగా నా క్లయింట్లు పైనెంబరు దావాలోని వాదులు కొవ్వూరు 9వ అదనపు జిల్లా మరియు సెషన్స్ జడ్జి వారి కోర్టులో పై నెంబరు దావాను వారి హక్కుల నిమిత్తం దావా వేసియున్నారు. పైనెంబరు దావాలో 5వ ప్రతివాదియైన ప్రోతాప్రగడ ప్రసన్నకు శ్రీకోర్టు వారి ద్వారా ఎన్నిపర్యాయములు నోటీసులు పంపిననూ ఆమె తీసుకొనక కాలయాపన చేయుచున్నారు. కావున శ్రీకోర్టు వారు మీ హాజరు నిమిత్తం ది.వి.**26-03-2025**వ తేదీకి వాయిదా వేసినారు. మీరు సదరు తేది ఉదయం 10.30 గం.నిలకు పైకోర్టు వారి ఎదుట స్వయంగా గాని, మీ వకీలు గారి ద్వారా గాని హాజరయ్యి మీ యొక్క ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేనియెడల పైదావా మీ పరోక్షమున తీర్మానించబడును.
వాయిదా తేది: 26-03-2025
శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం
టి.ఎన్.వి.రమణమూర్తి, ఎమ్.గోపి
వాదుల తరపున అడ్వకేట్స్, కొవ్వూరు.
ఎస్.బెనర్జీ విజయకుమార్
కొవ్వూరు అడ్వకేట్, భీమవరం.
తేది.19-03-2025 సెల్: 9440644116.

దేవదాయ ధర్మదాయ శాఖ
శ్రీ లక్ష్మీ గణపతి దేవాలయము - సత్రంపాడు, ఏలూరు.
పంచెలు, కండువాలు బహిరంగ వేలంపాట
ఏలూరు జిల్లా, ఏలూరు మండలం, ఏలూరు నగరం, సత్రంపాడులో వేంచేసి యున్న **శ్రీ లక్ష్మీ గణపతి దేవాలయము** నందు శ్రీ స్వామి వారికి భక్తులచే సమర్పించబడిన పంచెలు, కండువాలను **ది.30-03-2025 ఆదివారము ఉదయం గం.9-00లకు** దేవస్థానము వద్ద దేవదాయ ధర్మదాయ శాఖ అధికారుల సమక్షమున బహిరంగ వేలం పాట ద్వారా అమ్మకమునకు పాట నిర్వహించబడును. కావున ఆసక్తి గలవారు పాటలో పాల్గొనవలసినదిగా కోరుచున్నాము.
సత్రంపాడు, ఏలూరు. **కార్యనిర్వహణాధికారి,**
తేది.18-03-2025 **సెల్: 9948166689**

గ్రామపంచాయతి కార్యాలయం, చినతాడినాడ
టెండరు ప్రకటన
ఆర్.ఓ.సి. నెం. 01/2025 **తేది.18-03-2025**
ఏలూరు జిల్లా, కలిదిండి మండలం, చినతాడినాడ గ్రామ పంచాయితీ యందు 2025-26 సం॥నకు కాంట్రాక్ట్ లేబర్ పద్ధతిపై ఈ దిగువ తెలిపిన పనులు నిర్వహణకు గాను సీల్డు టెండర్లు ది. 28-03-2025 తేది ఉదయం 11.00 గంటలకు గ్రామ పంచాయితీ కార్యాలయం నందు పంచాయితీ కార్యదర్శి వారిచే గాని, వారి అనుమతి పొందిన వారిచే గాని స్వీకరించబడును. సదరు టెండర్లు అదే రోజు మధ్యాహ్నం గం॥ 12-30 ని॥లకు అప్పటికి హాజరైన టెండరుదారుల సమక్షంలో టెండర్లు తెరవబడును. మిగిలిన విషయములు ఈ కార్యాలయం పని వేళల యందు కోరి పొందవచ్చును.

వ.నెం.	పని వివరము	పని కాలము	ధరావత్తు
1	స్వీపర్	01-04-2025 నుండి 31-03-2026 వరకు అనగా ఒక సంవత్సర కాలం	రూ. 5000/- లేక సాల్వేన్సి

కార్యదర్శి వారి నోట్: గతంలో పని చేసిన వారికి ప్రాధాన్యత ఇవ్వబడును. మరియు పంచాయితీ నిల్వలను బట్టి పేమెంట్ జరుపబడును.
సం/- **గండికోట ఏసుబాబు**
సర్పంచ్, చినతాడినాడ గ్రామపంచాయితీ
కలిదిండి మండలం, ఏలూరు జిల్లా.
సం/- **పి. రాంబాబు**
గ్రామపంచాయితీ కార్యదర్శి, చినతాడినాడ
కలిదిండి మండలం, ఏలూరు జిల్లా.